క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సంగం: స్థానిక ఐటీఐలో 2025–26 విద్యాసం వత్సరానికి సంబంధించి ఫిట్టర్ కోర్సులో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బీ మురళీధర్ గురువారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 29వ తేదీ ఉదయం 10 గంటలకు ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 99639 50604, 76718 61779, 63005 99477, 99851 69099 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజన చిన్నారికి ఆర్థిక సాయం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజనకాలనీకి చెందిన పెంచలమ్మ కుమార్తె పోలమ్మకు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షుడు జే ప్రణీత్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. పోలమ్మ హైడ్రోసిఫాలిస్ వ్యాధితో బాధపడుతుండడంతో తన ఆస్పత్రి సిబ్బంది, ట్రస్టు సభ్యులను ఇంటికి పంపి రూ.10వేలు నగదు అందజేశారు. భవిష్యత్‌లోనూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్, టీ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ–1 బాధ్యతల స్వీకరణ



దుత్తలూరు: మండల విద్యాశాఖ అధికారి–1గా షేక్ ఫజల్‌అలీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా–1గా పనిచేస్తున్న పద్మనాభరావు జలదంకి మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరులోని ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఫజల్‌అలీకి ఎంఈఓ–1గా అదనపు బాధ్యతలను అప్పగించారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



సీతారామపురం : మండల నూతన తహసీల్దార్‌గా షేక్ ఫజిహా గురువారం బాధ్యతలు స్వీకరించారు. భూముల మ్యుటేషన్ వ్యవహారంలో మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న పీవీ కృష్ణారెడ్డిని కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జిల్లా పౌర సరఫరాల శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమెను అడహక్ తహసీల్దార్‌గా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ భోగ్యంవారిపల్లె సమీపంలో 565 జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. తిమ్మారెడ్డిపల్లికి చెందిన దేవరపు మాలకొండయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై గడ్డిమోపు పెట్టుకుని పొలం నుంచి ఇంటికి వస్తున్నాడు. తిమ్మారెడ్డిపాళెం చెరువు వద్ద జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో మార్టూరు నుంచి మదనపల్లెకు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మాలకొండయ్య తీవ్రంగా గాయపడగా స్థానికులు హుటాహుటిన పామూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

సంగం/జలదంకి: వినాయక చవితికి విగ్రహాలను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించే వారు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్, జలదంకి ఎస్సై లతీఫున్నీసా తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేస్తున్నట్లుగా చెప్పారు. ఉత్సవ కమిటీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మండప స్థలాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ స్కానర్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తామన్నారు. అనుమతుల్లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. డీజేలు, లౌడ్‌స్పీకర్లు, అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు.వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఉత్సవ కమిటీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాహం..దాహం

- పూడిపోయిన బావులు
- మరమ్మతులకు గురైన మోటార్లు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- మూడు నెలలుగా నిలిచిన పెన్నానీటి సరఫరా
- తాగునీటికి అల్లాడుతున్న 12 గ్రామాల ప్రజలు

అనుమసముద్రంపేట: మండలంలోని 12 గ్రామాలకు పెన్నా నది నుంచి తాగునీటిని అందించే మంచినీటి పథకం మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. మండలంలోని 12 గ్రామాల దాహార్తిని తీర్చేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో సంగం మండలం కోలగట్ల వద్ద పెన్నానదిలో మంచినీటి బావులు తవ్వి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించారు. అక్కడి నుంచి పైపులైన్ ద్వారా ఏఎస్‌పేటకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ మొత్తం నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మోటార్లకు సంబంధించిన మరమ్మతులను మాత్రం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే చేపట్టాల్సి ఉంది. అయితే గతేడాది పెన్నాకు వరదలు రావడంతో కోలగట్ల వద్ద ఉన్న బావులు పూడిపోయాయి. దీనికితోడు మంచినీటి పథకం మోటార్లు సైతం మరమ్మతులకు గురవడంతో మూడు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఆర్థిక స్తోమత లేని వారు పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటినే పట్టుకుని తాగుతున్నారు.



పెన్నానది నీటిని నిల్వ చేసే వాటర్ ట్యాంక్

సమన్వయ లోపంతో..

కోలగట్ల వద్ద మంచినీటి పథకం మోటార్ల కోసం 66 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లోడ్ అధికమవడంతో మోటార్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. అయితే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నగదు చెల్లించకపోవడంతో చర్యలు తీసుకోలేకపోతున్నామని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ, కాంట్రాక్టర్ మధ్యన సమన్వయలోపం కారణంగానే తాగునీరు అందడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారే తప్పా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులతో పాటు రాజకీయ నాయకులు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఏఎస్‌పేటకు పెన్నా నది నుంచి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

కోలగట్ల వద్ద పెన్నానదిలోని ఇంకుడు బావులు పూడిపోవడంతో పాటు మోటార్లు సైతం మరమ్మతులకు గురవడంతో మూడు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. బావుల పునరుద్ధరణ, మోటార్ల మరమ్మతులకు వేలాది రూపాయలు ఖర్చవుతాయి. ఈ విషయాన్ని ఇప్పటికే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

– రవితేజ, ఇన్‌చార్జి ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



కావలిలో అంగన్‌వాడీల మానవహారం

కావలి (జలదంకి)/ఉదయగిరిరూరల్ /అనుమసముద్రంపేట : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు కావలిలోని ఉదయగిరి రోడ్డు వద్ద అంగన్‌వాడీలు గురువారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు పెంచలయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఉన్న ఐసీడీఎస్ యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌ను తీసుకురావాలని, 5జీ కలిగిన కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యూటీని అమలు చేయాలని, నాణ్యమైన సరుకులు ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే దశల వారీగా పోరాటాలను కొనసాగిస్తామన్నారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్, యూనియన్ అధ్యక్షురాలు రుక్మిణి, కార్యదర్శి సుభాషిణి, నాయకులు జయంతి, ప్రభావతి, విజయలత, రఘురావమ్మ, కళావతి, జ్యోతి, బిందు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మానవహారం చేపట్టారు. సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, కొడె రమణయ్య, నాయకులు నాగేశ్వరరావు, నాయబ్, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఎస్‌పేట బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీవర్కర్ అండ్ హెల్పర్స్, రైతు సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు మానవహారం చేపట్టారు. రాష్ట్ర రైతు సంఘం సభ్యులు లక్ష్మీపతి, సీపీఎం కార్యదర్శి నిస్సార్, సీఐటీయూ కార్యదర్శి గయాజ్, రైతు సంఘ కార్యదర్శి ఇలియాజ్, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

మండల మైనార్టీ సంఘ అధ్యక్షుడిగా సందానీబాషా



ఆత్మకూరు: దళిత, గిరిజన, మైనార్టీ సంఘాల జేఏసీ సమావేశాన్ని ఆత్మకూరులోని ఓ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ సంఘాల అధ్యక్షుడు తుమ్మా మస్తాన్, ఉపాధ్యక్షుడు దావిద్, మహిళా అధ్యక్షురాలు చల్లా మాధవి ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ సమావేశంలో మైనార్టీ, గిరిజనుల సమస్యలపై చర్చించారు. వారి సమస్యల పరిష్కారానికి జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేయనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. అనంతరం ఆత్మకూరు మండల మైనార్టీ సంఘ అధ్యక్షుడుగా షేక్ సందానీబాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన్ని రాష్ట్ర దళిత, గిరిజన, మైనార్టీ సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు బాలకీర్తి రవి అభినందించారు. కోవూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాలకు చెందిన మైనార్టీ, గిరిజన సంఘాల అధ్యక్షులు చింతపల్లి అనితమ్మ, తుమ్మా వాసు, షేక్ రఫీ, ఎస్‌కే ఖాజాహుస్సేన్, జేఏసీ కమిటీ సభ్యులు ఆలూరి రామకృష్ణ, ప్రభాకర్, ప్రభుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశత్వంపై వెల్లువెత్తిన నిరసన



బోగోలులో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- రెడ్‌బుక్ రాజ్యాంగం కూడా నివ్వెరపోయే స్థాయిలో తప్పుడు కేసులు
- డ్రోన్‌తో తవ్వకాలు చిత్రీకరిస్తే హత్యాయత్నం కేసులు పెడుతారా?
- టీడీపీ ఆరోపణలపై తీవ్రంగా ఖండించిన వైఎస్సార్‌సీపీ నాయకులు
- బోగోలులో కొవ్వొత్తుల ర్యాలీ

బిట్రగుంట: కావలి నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగం కూడా నివ్వెరపోయే స్థాయిలో తప్పుడు కేసుల పరంపర తారాస్థాయికి చేరుకుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు ఆగ్రహం వ్యక్తం చేశారు. జలదంకి మండలం అన్నవరం క్వారీలో అక్రమ తవ్వకాలను డ్రోన్‌తో చిత్రీకరణ చేస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ తప్పుడు కేసులు పెట్టడం, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిపై ఆరోపణలు చేస్తూ కేసు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బోగోలులో గురువారం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దిబోయిన రఘు, తదితరులు మాట్లాడుతూ కావలిలో టీడీపీ నాయకుల వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అన్నవరం క్వారీలో అక్రమ తవ్వకాలను వెలికి తీసేందుకు డ్రోన్‌తో వీడియో చిత్రీకరిస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లపై క్వారీలో పనిచేసే వ్యక్తులు దాడి చేసి తప్పుడు కేసులు పెట్టడం కావలిలో జరుగుతున్న కీచక రాజకీయాలకు నిదర్శనమన్నారు. జర్నలిస్ట్‌లు సహా ఇంకెవ్వరూ క్వారీ వైపు కన్నెత్తి చూడకుండా ఏకంగా ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డిపై హత్యాయత్నం, రెక్కీ అంటూ తప్పుడు కేసులు పెట్టారంటూ మండిపడ్డారు. ముసునూరు మనీస్కాంతో పాటు కూటమిపాలన అక్రమాలపై ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేరును కూడా కేసులో ఇరికించడం టీడీపీ నాయకుల దుర్నీతి, నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి తప్పుడు కేసులతో వేధిస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగం కూడా నివ్వెరపోయే స్థాయిలో కావలిలో అక్రమ కేసుల పరంపర కొనసాగుతోందని మండిపడ్డారు. అధికారులు కూడా అక్రమ కేసులకు సహకరించడం, తప్పుడు కేసులు మోపడం సరికాదన్నారు. అధికారులు కనీసం ఒక్కసారైనా తాము చేస్తుంది మంచి పనేనా.. కాదా అనేది ఆత్మ పరిశీలన చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలు మారుతూ ఉంటాయి కానీ ప్రజలకు అంతిమంగా న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులదేనని, అటువంటి అధికారులు కూడా తప్పుడు కేసులకు వంతపాడడం మంచి పద్ధతి కాదన్నారు. తప్పుడు కేసులకు త్వరలోనే తగిన మూల్యం చెల్లించకతప్పదని తెలిపారు. జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, వైస్‌ఎంపీపీ మద్దిబోయిన పద్మ, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు పత్రి అంకులయ్య, ఉప్పాల మాచర్ల, మేకల శ్రీనివాసులు, సుందరరాజు, తోటపల్లి సాగర్, అమిరిశెట్టి వెంకయ్య, గోపిశెట్టి వెంకయ్య, సూరపనేని శ్రీనివాసులు, మత్స్యకార నాయకులు గోవిందస్వామి, మండల కోఆప్షన్ సభ్యుడు నాయబ్‌రసూల్, ఎంపీటీసీ గంగపట్ల సనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు హెచ్‌ఎంల సమావేశం

ఉదయగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో జరిగే సమావేశంలో ఉల్లాస్ కార్యక్రమం, ఎన్‌రోల్‌మెంట్, అపార్, ఎఫ్‌ఏ–1 మార్కుల నమోదు, తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కిలో పొగాకు సగటు ధర రూ.214

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకు సగటు ధర రూ.214.13 పలికినట్లుగా వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 174 బేళ్లు రాగా, 67 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.285, కనిష్ఠంగా రూ.140, సగటున రూ.214.13 ధర పలికిందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోమశిల: సోమశిల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ సురేష్ బాబు గురువారం తెలిపారు. సోమశిల ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 8 గంటల వరకు త్రీఫేస్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరు రెడ్‌క్రాస్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ నెల 25 నుంచి 20 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని గురువారం తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి వివిధ రకాల వ్యాపారాలు, సాంకేతిక నైపుణ్యంపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు మండల పరిషత్, ఆత్మకూరులోని మెప్మా కార్యాలయాల్లో సంప్రదించాలని కోరారు.

ప్రత్యేక గ్రీవెన్స్‌కు 96 అర్జీలు



మర్రిపాడు: మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మకూరు ఆర్డీఓ భూమిరెడ్డి పావని ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్‌ను గురువారం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై మొత్తం 93 అర్జీలు అందినట్లుగా తహసీల్దార్ అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మర్రిపాడు మండలంలో భూ సమస్యలు అధికంగా ఉండడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించినట్లు తెలిపారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



అల్లూరులో అవగాహన కల్పిస్తున్న సార్డ్స్ ప్రతినిధులు

కావలి (జలదంకి)/అల్లూరు : కావలిలోని జవహర్ భారతి నర్సింగ్ కళాశాలలోని విద్యార్థులకు సార్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సార్డ్స్ సిబ్బంది మాట్లాడుతూ నేటి సమాజంలో యువతపై హెచ్‌ఐవీ ప్రతికూల ప్రభావం చూపిస్తుందన్నారు. హెచ్‌ఐవీ వ్యాప్తి, నిర్ధారణ, చికిత్స విధానం, చట్టాలపై అవగాహన కల్పించారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ బ్యూలా, సార్డ్స్ సిబ్బంది ప్రశాంతి, అనిత, దివ్య, శ్రీరేఖ తదితరులు పాల్గొన్నారు. హెచ్‌ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ జే రూత్‌బెనోమి అన్నారు. అల్లూరులోని రామకృష్ణ డిగ్రీ కళాశాల, నాగులమ్మ కాలువకట్ట ప్రాంతంలో సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్, సంస్థ సభ్యులు జయమ్మ, అనిత, కృష్ణవేణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలేరమ్మ తిరునాళ్ల



కలిగిరి: మండలంలోని పోలంపాడులో ఐదు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తిరునాళ్ల గురువారంతో ముగిసింది. చివరిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూబండ్లు, ప్రభలు తిప్పారు. చివరిగా సుడిమాను తిప్పి తిరునాళ్లకు ముగింపు పలికారు.



పొంగళ్ల నైవేద్యాలను తీసుకొస్తున్న మహిళలు

కోలహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

పోలేరమ్మ తిరునాళ్ల ముగింపు సందర్భంగా ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఏడు జతల ఎద్దులు పోటీ పడగా లెనిన్ ఎంటర్‌ప్రైజెస్ (పొట్టేపాళెం) ఎద్దులు ప్రథమ బహుమతి రూ.20వేలు, పల్లబోయిన కృష్ణతేజారెడ్డి (అల్లూరు) ఎద్దులు ద్వితీయ బహుమతి రూ.15వేలు, లెనిన్ ఎంటర్‌ప్రైజెస్ (పొట్టేపాళెం) ఎద్దులు తృతీయ బహుమతి రూ.10వేలు అందుకున్నాయి. అలాగే మద్దిరెడ్డి శ్రీనివాసులరెడ్డి (ఆత్మకూరు) నాల్గో బహుమతి రూ. 6వేలు, తాళ నరసింహుల నాయుడు (మర్రిపాడు) ఐదో బహుమతి రూ. 4వేలు, బాలంరెడ్డి గోవిందరెడ్డి (కావలి), ఏల్లూరు సుమంత్‌నాయుడు ఆరో బహుమతి రూ.1,116 బహుమతులు అందుకున్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని ఊరేగింపు



దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరోరోజులుగా కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా చివరి రోజైన గురువారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని విశేషంగా అలంకరించి మేళతాళాలు, కోలాట ప్రదర్శనల నడుమ ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు మార్జిన్‌లో టైర్లు దిగబడడంతో పక్కకు ఒరిగిన బస్సు

సోమశిల: ఎదురుగా వచ్చిన లారీకి సైడిచ్చే క్రమంలో కళాశాల బస్సు రోడ్డు మార్జిన్‌లో దిగబడిపోయి పక్కకు ఒరిగిన ఘటన అనంతసాగరం మండలం ఇనగలూరు వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి నుంచి ఇనగలూరు, వెంగంపల్లి, చిరివెళ్ల , పొంగూరు మీదుగా ముంబయి జాతీయ రహదారిని కలిపే సింగిల్ రోడ్డుకు మార్జిన్లు సరిగా లేవు. గురువారం ఉదయం ఆత్మకూరులోని ఓ కళాశాలకు చెందిన బస్సు 30 మంది విద్యార్థులతో ఆత్మకూరుకు వస్తున్న క్రమంలో ఇనుగలూరు వద్ద ఎదురుగా లారీ వచ్చింది. దానికి సైడిచ్చే క్రమంలో బస్సును డ్రైవర్ మార్జిన్‌లోకి దింపగా టైర్లు కుంగిపోయి ఓ పక్కకు ఒరిగింది. దీంతో డ్రైవర్ బస్సును నిలిపివేసి విద్యార్థులను కిందకు దించడంతో ప్రమాదం తప్పింది. కాగా సుమారు 15 కిలోమీటర్లు ఉన్న సింగిల్‌రోడ్డు మార్జిన్లు సరిగా లేవు. వర్షాలు పడిన సమయంలో వాహనాలు పక్కకు దిగితే టైర్లు దిగబడిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్లను పటిష్టపరచాలని వాహనచోదకులు కోరుతున్నారు.

దివ్యాంగ పింఛన్ల తొలగింపు అన్యాయం

మర్రిపాడు: దివ్యాంగుల పింఛన్ల తొలగింపు అన్యాయమని మండల వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడు చంద్ర నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన నోటీసులు అందుకున్న దివ్యాంగులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 117 పింఛన్లు తొలగించారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్లు అందుకుంటున్న దివ్యాంగులను అనర్హులుగా పేర్కొంటూ నోటీసులు అందజేసి తొలగించడం దుర్మార్గమన్నారు.

ప్రమాదభరితంగా బ్రిడ్జి



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని భోగ్యంవారిపల్లి వద్ద 565 జాతీయ రహదారిపై బ్రిడ్జి ప్రమాదభరితంగా ఉంది. బ్రిడ్జిపై భాగంలో కాంక్రీట్ దెబ్బతిని లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు ఇనుప చువ్వలు సైతం బయటకు కనిపిస్తున్నాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి బ్రిడ్జి మరింత దెబ్బతినే అవకాశం ఉంది. అందువల్ల హైవే అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



సీతారామపురం : ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. మండల తహసీల్దార్ కార్యాలయ భవనం వెనుక వైపు మర్రి మొక్క మొలిచింది. దాన్ని తొలగించడంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో గోడలోకి వేర్లు చొచ్చుకుపోయి బీటలు వారాయి. దీన్ని చూసిన తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలు అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. సొంత భవనాలైతే ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు.